క్లుప్తంగా

ఆర్డీఓకు వినతి



ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న బాధిత లబ్ధిదారులు

కల్లూరు: డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ లబ్ధిదారులు బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని లాటరీలో చీటీలను రహస్యంగా వేసి మోసం చేశారని ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్‌కు విన్నవించామన్నారు. వీటిని రద్దు చేసి మరోసారి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, ఉమర్‌బి, నాగమణి, ఉమామహేశ్వరి, కోటేశ్వరి, వెంకట నరసమ్మ, ఇమామ్‌బి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

కల్లూరు: రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ప్రతిభాపాటవ పరీక్ష(స్పెల్ విజార్డ్)ల్లో కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి రమణ శశిధర్ రెండో స్థానం నిలిచాడు. ఇటీవల వరంగల్‌లోని నిట్‌లో ఈ పోటీలు జరగగా, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయి రెండో బహుమతి సాధించిన శశిధర్‌ను హెచ్‌ఎం జి.మాధవరావు, ఉపాధ్యాయులు టి.వీరస్వామి, రవిరాజు, తదితరులు అభినందించారు.

మోడల్ స్కూల్లో ఫుడ్ సేఫ్టీపై అవగాహన

కారేపల్లి: కారేపల్లి మోడల్ స్కూల్‌లో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రతన్‌రావు ఫుడ్ సేఫ్టీపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, వసతి గృహంలో విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను పరీక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, నితిన్, జానకి రాములు, నాగేశ్వరరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా రవి



మద్దెల రవి

వైరా: బీఆర్‌ఎస్ పార్టీ వైరా పట్టణ అధ్యక్షుడిగా మద్దెల రవిని నియమిస్తూ వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధు ఆయనను నియమించినట్లు తెలిపారు. పట్టణంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నరేష్

తల్లాడ: డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా తల్లాడకు చెందిన సత్తెనపల్లి నరేష్‌కు అవకాశం దక్కింది. ఈ నెల 14, 15 తేదీల్లో నల్గొండలో జరిగిన డీవైఎఫ్‌ఐ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో నరేష్‌ను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రకటించారు.

బీమా చెక్కు అందజేత

ముదిగొండ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన వెంకటాపురానికి చెందిన సూరపల్లి మణెమ్మ కుమారుడికి రూ.లక్ష బీమా చెక్కును, ముదిగొండలో విశాల సహకార సొసైటీ కార్యాలయంలో బుధవారం సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి అందజేశారు. సొసైటీలో రుణం పొందడం వలన ఇన్సూరెన్స్ చెక్కు అందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బట్టు పురుషోత్తం, సెక్రటరి కె.వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కల్లూరు రూరల్: మండలంలోని పెద్ద కోరుకొండి వద్ద తల్లాడ మండలం కలకొడిమగ్రామం నుంచి వస్తున్న 55 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రఘు తెలిపారు. సమాచారం మేరకు నిఘా వేసి పట్టుకున్నట్లు తెలిపారు. భరత్, నవీన్, జంపాలకృష్ణ, కనకాచారిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందుల కిట్లు పంపిణీ

మధిర: వంగవీడు, సిరిపురం గ్రామాల్లో బుధవారం మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో బోదవ్యాధి బాధితులకు ప్రభుత్వం అందించిన కిట్లను పంపిణీ చేశారు. బోదవ్యాధి కిట్లతో పాటు మందులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు బొగ్గుల పద్మావతి, కనకపుడి పెద్ద బుచ్చయ్య చేతుల మీదుగా అందజేశారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఊటుకూరు భాస్కరరావు, శరత్ బాబు మాట్లాడుతూ.. బోదకాలు వ్యాధి బాధితులు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాడవలసిన మందుల వివరాలపై అవగాహన కల్పించారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

- వేడుకలకు సర్వం సిద్ధం
- ఈ నెల 18న శివపార్వతుల కల్యాణం
- మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు



వందనంలో వేడుకలకు సిద్ధమైన రామలింగేశ్వర స్వామి ఆలయం



మధిరలోని మృత్యుంజయ స్వామి ఆలయం (ఇన్‌సెట్) మృత్యుంజయ స్వామి

మధిర/చింతకాని: మహాశివరాత్రి ఉత్సవాలకు మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్నటువంటి శివాలయాలు ముస్తాబయ్యాయి. చింతకాని మండలంలోని మూడు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 18న తెల్లవారుజాము నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. వందనం గ్రామంలో ఉన్నటువంటి పురాతన దేవాలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే నేరడ గ్రామంలోని భ్రమరాంబ సమేత శ్రీ రామలింగేశ్వరరస్వామి, పందిళ్లపల్లి గ్రామంలోని శ్రీ గంగా గౌరీ సమేత రామలింగేశ్వరస్వామి, కొదుమూరులోని శ్రీ రామలింగేశ్వరస్వామి, పాతర్లపాడు, నాగులవంచ గ్రామాల్లోని శివాలయాలను కూడా ప్రత్యేకంగా అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నుంచి ఆలయాల్లో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన వంటి పూజలతో పాలు ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

మధిర మృత్యుంజయస్వామికి కాశీ పవిత్రత..

మధిరలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాశిలో మాదిరిగా పడమరవైపున నదీప్రవాహం, ఉత్తరం వైపున శ్మశానంతో కలిగి మధిరలో ఉన్నటువంటి మధిర మృత్యుంజయస్వామి ఆలయం కాశీ అంతటి పవిత్రత కలిగిఉందని ఈ ప్రాంత భక్తుల విశ్వాసం. గంగా పార్వతీసమేత మృత్యుంజయ స్వామి వారి విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యస్వామి తదితర విగ్రహాలతో ఉన్న దేవాలయంలో ప్రతి శివరాత్రికి 17 నుంచి 21 వరకు అత్యంత వైభవంగా తిరునాళ్లను నిర్వహిస్తారు. ఇప్పటికే జాయింట్‌వీల్, రోబో డ్యాన్స్, చెక్కబావి, హంస, బ్రేక్‌డ్యాన్స్‌లతో పాటు హోటళ్లు, ఆటవస్తువుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.





జాతర ఆవరణలో ఏర్పాటు చేసిన ఆటవస్తువులు

భక్తులకు సౌకర్యాలు..



ఈ నెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకొని మధిర మృత్యుంజయ స్వామి ఆలయంలో జరిగే తిరునాళ్లకు ఖమ్మం, నల్గొండ, ఎన్టీఆర్, గుంటూరు తదితర జిల్లాల నుంచి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఎద్దుల బండలాగుడు పోటీలు జరుగుతాయి. భక్తుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించడం జరిగింది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

– వంకాయలపాటి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్, మధిర

పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం..



మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ఎవరైన ఉత్సవాల్లో మద్యం అమ్మకాలతో పాటు డీజేలను పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఈ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలి.

– పొదిల వెంకన్న, ఎస్సై, చింతకాని

గిరిజన సంఘం పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే



వైరా: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, నాయకులు

వైరా: ఈ నెల 25న కారేపల్లి మండల కేంద్రంలో జరిగే తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా 3వ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ బుధవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా పని చేస్తున్న గిరిజన సంఘం సమావేశాలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, కౌన్సిలర్ దారెల్లి కోటయ్య, నాయకులు బన్సీలాల్, హరిచంద్, కృష్ణకాంత్, రమేష్, చరణ్, ప్రసాద్ పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి..

ఏన్కూరు: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరుకి కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ హామీ ఇచ్చారు. తమకు ఏన్కూరు జర్నలిస్టులు అందరు వైరా క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రాములు నాయక్‌ను కలిశారు. తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి జీఓ వస్తుందని వచ్చిన వేంటనే ఇండ్ల స్థలాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏన్కూరు మండల జర్నలిస్టులు బండి శంకర్, జె.కృష్ణమాచారి, చింతలబోయిన నర్సింహారావు, కొవ్వూరి రామారావు, చెరకు రాంబాబు, బలబత్తుల శివకుమార్, సందీప్, కూరకుల రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రమ్మకు నివాళి

కొణిజర్ల: మండలంలోని సిద్దిక్‌నగర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం సానుభూతి పరురాలు యరమల సావిత్రమ్మ చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బొంతు రాంబాబు, చలపతిరావు, కుటుంబరావు పులూరి వెంకటేశ్వర్లు, రోషన్ బేగ్, నరసయ్య తదితరులు నివాళులు అర్పించారు. సావిత్రమ్మ కుమారులు రైతు సంఘం మండల కార్యదర్శి యరమల మాధవరెడ్డి సత్యనారాయణరెడ్డి, రాజశేఖరరెడ్డి, కృష్ణారెడ్డిలను పరామర్శించారు.

వెంకటరెడ్డికి భట్టి..

ముదిగొండ: మండలంలోని అయ్యగారిపల్లికి చెందిన ఇలవల వెంకటరెడ్డి మృతదేహాన్ని బుధవారం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. వెంకటరెడ్డి మృతదేహానికి ఖమ్మంలో పోస్టుమార్టం అనంతరం అయ్యగారిపల్లికి తరలించి అంతిమ యాత్రలో ఎలాంటి ఘటనలు చేటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పాలేరు షుగర్స్ మాజీ చైర్మన్ నరసింగరావు, వల్లూరి భద్రారెడ్డి, నాయకులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం



కల్లూరులో అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రఘు

సత్తుపల్లిటౌన్/ తల్లాడ/ ముదిగొండ/ బోనకల్/ ఎర్రుపాలెం/ కల్లూరు/ ఏన్కూరు: అన్ని మండల, పట్టణాల్లోని పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసి అల్పాహారం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ హైస్కూల్‌లో కౌన్సిలర్ ఎస్‌కే చాంద్‌పాషా, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్‌కె జాన్‌బీ, తల్లాడలోని కుర్నవల్లి పాఠశాలలో సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, సర్పంచ్ ఐలూరి లక్ష్మీ, ముదిగొండలోని జెడ్పీఉన్నత పాఠశాలలో సర్పంచ్ మందరపు లక్ష్మి, వైస్ ఎంపీపీ దామోదర్‌లు, ఎర్రుపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక సర్పంచ్ మొగిలి అప్పారావు, హెచ్‌ఎం మురళీ మోహన్‌రావులు, కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ బీరవల్లి రఘు, ఏన్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శైల, సుభాషిణిలు అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. బోనకల్, గోవిందాపురం(ఎల్) ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిల్లలమర్రి శివనరసింహారావుతో పాటు ఉపాధ్యాయులు కలసి విద్యార్థులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సర్పంచ్ ఉమ్మినేని బాబు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే అల్పాహారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వీర్ల సంరోజిని, శీలం శ్రీనివాసరెడ్డి, వెంకట్రామిరెడ్డి, జి.మాధవరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ జి.నాగరాజు, ఉప సర్పంచ్ పోతురాజు వెంకటయ్య, శివారెడ్డి, మందరపు వెంకన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ ఇరుకు ప్రభాకర్, విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మణ్‌రావు, లక్ష్మీరాజ్యం, బాలస్వామి, నాగభూషణం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కమ్లి, మేకల కృష్ణ, పీఈటీ వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన కార్యకర్తలు



బస్వాపురం నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలు

కొణిజర్ల: వైరా అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో బుధవారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన వైరా నియోజక వర్గ ఆత్మీయ సమ్మేళన సభకు కొణిజర్ల మండలం నుంచి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఎంపీపీ గోసు మధు, పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావుల నేతృత్వంలో మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 3 వేల మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. బస్వాపురం నుంచి కోసూరి శ్రీనివాసరావు యూత్ భారీ మోటర్ సైకిల్ ర్యాలీలో తరలి వెళ్లారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాత వెంకటరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలోని వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల భవన నిర్మాణ దాత ఎన్‌ఆర్‌ఐ వేమిరెడ్డి వెంకటరెడ్డి యూనిఫాం, బ్యాగులను వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బ్యాగులను, యూనిఫాంను దాత వేమిరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ జయలక్ష్మి, ఎంపీటీసీ కృష్ణారావులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్లు కృష్ణారెడ్డి, మల్లేశ్వరరావు, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్లూరు రూరల్: మండలంలోని కప్పలబంధం వద్ద ఈ నెల 2న సాగర్‌కాల్వలో పడి చనిపోయిన లక్కిరెడ్డి రామిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం ఆర్థిక సాయం అందించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా ఆయన కుటుంబ సభ్యులకు 10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ ఇస్మాయిల్, బి.లక్ష్మణరావు, నందిగామ ప్రసాద్, మాధవరెడ్డి, సాంబశివారెడ్డి, గోపిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, జయబాబురెడ్డి, వెంటేశ్వరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్ట సత్తెమ్మతల్లికి ఎమ్మెల్యే సండ్ర పూజలు



సత్తుపల్లిరూరల్: గుట్ట సత్తెమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల గుట్టసత్తెమ్మ తల్లి తిరునాళ్లు గతమూడురోజులుగా ఆలయ కమిటీ నిర్వాహకులు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తిరునాళ్ల మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో సత్తెమ్మతల్లి అమ్మవారిని ఆరాధిస్తూ మహోత్సవం నిర్వహించుకోవటం అభినందనీయమన్నారు. మహోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ నాయకులు శంకర్‌రావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు షేక్ రఫీ, మల్లూరు అంకమరాజు, భీమిరెడ్డి గోపాలరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎర్రబాబు, వెంకటరెడ్డి, సురేష్, భూమానాగిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏసీపీ ..

సత్తుపల్లి: కల్లూరు ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బొజ్జ రామానుజం బుధవారం సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వ్యాకులమాత దేవాలయ పునఃప్రతిష్ఠ



బనిగండ్లపాడులో వ్యాకుల మాత స్వరూపంతో ఊరేగింపు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని వ్యాకులమాత దేవాలయ వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ పీఠాధిపతి ఉడుముల బాల, ఖమ్మం పీఠాధిపతి గోవింద్ జోజిలు సమష్టి దివ్య బలిపూజ, ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. పతాక ఆవిష్కరణ అనంతరం వ్యాకులమాత స్వరూపంతో గ్రామంలో ఊరేగింపు చేశారు. బ్యాండు మేళాలతో విద్యార్థులు, మహిళలు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. విచారణ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక చర్చి ఫాదర్ తలపనేని ఆంతోని, ఫాదర్‌లు ప్రవీణ్, జయరాజు, ఐజాక్, యేసురత్నం, పలు గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో.. పీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్

వేంసూరు: బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు చేసిదేమీ లేదని, కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్‌రావు అన్నారు. హథ్ సే హథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కల్లురుగూడెం, రాయుడు పాలెం, గూడురు, కొత్తురు, అమ్మపాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, అధికారంలోకి వస్తే చేసే కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగు, సాగునీరు, కరెంట్, రోడ్లు, ఉపాధి కల్పన కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సోమిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మర్లపాడు ఎంపీటీసీ రాఘవరెడ్డి, మధు, వేణు, సత్యం, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న నంబూరి రామలింగేశ్వరరావు

పెనుబల్లి: దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. మండలంలోని వీయంబంజర్ తాపీ మేస్త్రీల అడ్డాలో, మండాలపాడులోని డబుల్ బెడ్ రూం కాలనీలో, గొల్లగూడెం గ్రామాలలో బుధవారం ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశం పెనుబల్లి మండలాధ్యక్షుడు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నంబూరి మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్ర పథకాలను కొన్నింటిని అమలు చేయకుండా పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రాము, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మహేష్, మండల కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్సీ మోర్చా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సర్పంచ్‌లు

బోనకల్: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌లు మండల పరిషత్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 8నెలలుగా పంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి మరీ పంచాయతీ నిర్వహన పనులు చేపట్టామన్నారు. అనంతరం ఎంపీఓ శాస్త్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, తిరపతిరావు, రవి, ఇందు, సుబ్బారావు, వెంకటేశ్వరావు, పుల్లమ్మ పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలల్ మహారాజ్ 284 జయంతి వేడుకలు బుధవారం అన్ని మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ చిత్రపటాలకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానాలు నిర్వహించారు. సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని తహసీల్దార్లకు వినతులు అందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. మహారాజ్ సిద్దాంతాలను బావితరాలకు అందించాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



వైరా: సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్



మధిర: పూజలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు



సత్తుపల్లిరూరల్: 15వ బెటాలియన్‌లో నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా



సత్తుపల్లిటౌన్: అంబేడ్కర్ సెంటర్‌లో..



ఏన్కూరు: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..



కొణిజర్ల: అమ్మపాలెంలో..



కారేపల్లి: భోగ్ బండారో నిర్వహిస్తున్న బంజారాలు